షాబాద్ : ముద్దెంగూడలో కేసీఆర్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న షాబాద్ మాజీ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి

యాచారం : మొక్క నాటుతున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

మొయినాబాద్ : కేక్ కట్ చేస్తున్న నాయకులు

మాడ్గుల : కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కేసీఆర్.. తెలంగాణ ప్రదాత

- ఘనంగా తెలంగాణ జాతిపిత పుట్టిన రోజు వేడుకలు
- కేక్ కట్ చేసి సంబురాలు
- రోగులు, విద్యార్థులకు పండ్లు పంపిణీ
- పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

తెలంగాణ సాధకుడు, తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. రంగారెడ్డి జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో సోమవారం తెలంగాణ జాతిపిత జన్మదినాన్ని అభిమానులు, తెలంగాణవాదులు, పార్టీశ్రేణులు వేడుకగా జరుపుకొన్నారు. కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పలు చోట్ల వృక్షార్చనలో భాగంగా మొక్కలు నాటారు. దవాఖానల్లో వృద్ధులు, బాలింతలకు నగదు, రోగులకు పండ్లు అందజేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పండ్లు పంపిణీ చేశారు. రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి పలువురు యువకులు రక్తదానం చేశారు. తెలంగాణ కోసం కేసీఆర్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని సమున్నత శిఖరంగా ఎగరేసిన మహానేత అని కొనియాడారు.

- న్యూస్ నెట్‌వర్క్, రంగారెడ్డి జిల్లా, ఫిబ్రవరి 17

పెద్దఅంబర్‌పేట : మొక్క నాటుతున్న నాయకులు

కేశంపేట : కేక్ కట్ చేసి తినిపించుకున్న బీఆర్ఎస్ నేతలు

చేవెళ్ల టౌన్: కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు అంజనేయులు, ప్రభాకర్

కొందుర్గు : కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

చేవెళ్ల రూరల్ : ఆలూర్‌లో కేక్ కట్ చేసిన బీఆర్ఎస్ నాయకులు

ఇబ్రహీంపట్నం : వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్ రాంరెడ్డి తదితరులు

నందిగామ : విద్యార్థులకు ప్యాడ్‌లు అందజేస్తున్న మాజీ జడ్పీ వైస్ చైర్మన్ గణేశ్, సర్పంచ్‌ల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

మంచాల: రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రైతులకు మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

చేవెళ్లలో విద్యుత్ ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

చేవెళ్లటౌన్, ఫిబ్రవరి 17 : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తున్నదని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దేశమొల్ల ఆంజనేయులు, మండల అధ్యక్షుడు ప్రభాకర్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వంగ శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మంగలి బాల్‌రాజ్ అన్నారు. రైతులకు 24 గంటలు కరెంటు ఇవ్వాలని సోమవారం మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయాన్ని ముట్టడించారు. సీఎం రేవంత్‌రెడ్డి డౌన్, డౌన్, కాంగ్రెస్ పాలన మాకొద్దు అంటూ నినాదాలు చేశారు. అనంతరం విద్యుత్ ఏఈ రాజేందర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు 24గంటల కరెంట్ ఇస్తామని చెప్పి, కోతలతో ఇబ్బందులకు గురి చేస్తున్నదన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే విద్యుత్ కోతలు మొదలయ్యాయన్నారు. కార్యక్రమంలో వేజ్ బోర్డు మాజీ చైర్మన్ నారాయణ, వైస్ ఎంపీపీ ప్రసాద్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నర్సింహులు, మాజీ సర్పంచ్‌లు జంగారెడ్డి, సులోచన అంజన్ గౌడ్, పామెన మాజీ ఎంపీటీసీ సత్యనారాయణ చారి, న్యాలట మాజీ ఎంపీటీసీ ఎల్లయ్య, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్లు వెంకటేశ్, నాయకులు విగ్నేశ్ గౌడ్, కరుణాకర్ రెడ్డి, పాండు, శంకరయ్య, నత్తి కృష్ణారెడ్డి, రాజు, తండు సత్తి, దర్శన్, గని, మహేందర్, రాఘవేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఊపిరి పీల్చుకోలేకపోతున్నాం

పసుమాములలోని అమూల్ డెయిరీ ఎదుట నిరసన తెలుపుతున్న తారామతిపేట గ్రామస్తులు

పెద్దఅంబర్‌పేట, ఫిబ్రవరి 17: మురుగు ముప్పు నుంచి తమను కాపాడాలంటూ మున్సిపాలిటీ పరిధిలోని తారామతిపేట గ్రామస్తులు సోమవారం నిరసనకు దిగారు. అమూల్ డెయిరీకి సంబంధించిన రసాయన వ్యర్థాలు, జీహెచ్ఎంసీతోపాటు మున్సిపాలిటీకి చెందిన డ్రైనేజీ తారామతిపేటలోని ఆలయం పక్కనుంచి వెళ్తున్నదని, ఆ ప్రాంతంలో ఊపిరి పీల్చుకోవడం కూడా ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులకు విన్నవించినా సమస్య తీరడం లేదని తెలిపారు. కంపెనీల రసాయనాలతోపాటు డ్రైనేజీ నీటితో తీవ్రమైన దుర్వాసన వస్తున్నదని పేర్కొన్నారు. సమస్యను పరిష్కరించాలని పసుమాములలోని అమూల్ డెయిరీ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్ గౌడ్, భాస్కర్‌గౌడ్, మద్ది శివగౌడ్, వడ్డేపల్లి రాజ్‌కుమార్‌గౌడ్, సాయిగౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆటో స్వాధీనం.. దొంగకు రిమాండ్

కడ్తాల్, ఫిబ్రవరి 17 : చోరీకి గురైన ఆటోను స్వాధీనం చేసుకొని, దొంగను రిమాండ్‌కు తరలించిన ఘటన కడ్తాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాలు.. కందుకూరు మండల పరిధిలోని నేదునూర్ గ్రామానికి చెందిన సదానందగౌడ్ ఈ నెల 9న తన ప్యాసింజర్ ఆటోలో కొంత మంది ప్రయాణికులను ఎక్కించుకొని కడ్తాల్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు వచ్చాడు. వైద్యుడిని సంప్రదించి బయటకి వచ్చి చూడగా దవాఖాన ఎదుట నిలిపి ఉంచిన ఆటో కనిపించలేదు. వెంటనే బాధితుడు కడ్తాల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీస్‌స్టేషన్ నేర విభాగం కానిస్టేబుళ్లు రాజశేఖర్, రాంకోటి సాంకేతిక పరిజ్ఞానంతో ముమ్మరంగా దర్యాప్తు చేపట్టారు. లింగాల మండల పరిధిలోని కోమటికుంటకు చెందిన నాగశేషు ఆటోను దొంగిలించినట్లు గుర్తించిన పోలీసులు, సోమవారం తలకొండపల్లి చౌరస్తాలో ఆటోను స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం నిందితుడిని మహేశ్వరం కోర్టులో హాజరు పర్చి, చంచల్‌గూడ జైలుకు పంపినట్లు సీఐ తెలిపారు.

ఉప్పల చారిటబుల్ ట్రస్టు సేవలు అభినందనీయం

ఆమనగల్లు, ఫిబ్రవరి 17: తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ గుప్తా ఉప్పల చారిటబుల్ ట్రస్టు ద్వారా చేపడుతున్న సేవలు అభినందనీయమని మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, గువ్వల బాలరాజు అన్నారు. ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆర్థిక సహకారంతో ట్రస్టు చైర్మన్ ఆమనగల్లు మండల పరిధిలోని కోనాపూర్‌లో నిరుపేద కుటుంబానికి చెందిన బొడ్డుపల్లి జంగమ్మకు సొంత నిధులతో కొత్తగా ఇంటిని నిర్మింప చేశారు. సోమవారం తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం పురస్కరించుకుని మాజీ ఎమ్మెల్యేలు ఉప్పల వెంకటేశ్ గుప్తా కోనాపూర్‌లో జంగమ్మతో కలిసి రిబ్బన్ కట్ చేయించి గృహ ప్రవేశం చేయించారు. కొత్త ఇంట్లో చేపట్టిన సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్ గుప్తా, మాజీ ఎంపీపీ నిర్మల, మాజీ ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోనుగోటి అర్జున్‌రావు, కోనాపూర్ గ్రామ అధ్యక్షుడు కడారి రాజు, నాయకులు సంజీవ, సూరిగిమల్ల శేఖర్, కంబాలపల్లి రవి, యాదగిరి, భద్ర, రాజు, కుమార్, జంగయ్య, మల్లేశ్, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కోనాపూర్‌లో మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, గువ్వల బాలరాజు, ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేష్ గుప్తా

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

కేశంపేట, ఫిబ్రవరి 17: ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని కేశంపేట ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి, ఎంపీవో కిష్టయ్య అన్నారు. కేశంపేటతోపాటు మండల పరిధిలోని అల్వాల, మంగలిగూడ గ్రామాల్లో సోమవారం వారు ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

మొయినాబాద్, ఫిబ్రవరి 17: బతుకుదెరువు కోసం హైదరాబాద్ వలస వచ్చిన ఓ వివాహిత భర్తతో గొడవ పడి ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. ఈ ఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అజీజ్‌నగర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన కృష్ణాకాంత్ తన భార్య బైసాఖిదులే(18) బతుకుదెరువు కోసం హైదరాబాద్ వచ్చి అజీజ్‌నగర్ గ్రామ రెవెన్యూలో ఉన్న పీఎంఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో వలస కూలీలుగా పని చేస్తున్నారు. 6 నెలల నుంచి క్రికెట్ గ్రౌండ్‌లో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 16న ఇంట్లో భార్యభర్తలు గొడవ పడ్డారు. సాయంత్రం 6 గంటలకు ఇంటి నుంచి ఆమె వెళ్లిపోయింది. భర్త చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మానవత్వం చాటుకున్న ఆదిబట్ల పోలీసులు

మతిస్తిమితం లేని వ్యక్తిని చేరదీసి మాతృదేవోభవ ఆశ్రమంలో చేర్పిస్తున్న ఎస్సై వెంకటేశ్

ఆదిబట్ల, ఫిబ్రవరి 17 : ఓ మతి స్థిమితం లేని వ్యక్తిని చేరదీసి అనాథ ఆశ్రమంలో చేర్చి ఆదిబట్ల పోలీసులు మానవత్వం చాటుకున్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని బొంగుళూరు పరిసరాల్లో ఓ మతి స్థిమితం లేని వ్యక్తి నాలుగు రోజులుగా తిరుగుతుండగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందచేశారు. ఎస్సై వెంకటేశ్ అక్కడికి వెళ్లి మాసిన బట్టలు, కాలికి గాయంతో దుర్భరమైన స్థితిలో ఉన్నాడు. వెంటనే మాతృదేవోభవ అనాథ ఆశ్రమం వ్యవస్థాపకులు గట్టు గిరికి సమాచారం అందజేశారు. ఆ వ్యక్తిని వివరాలు అడుగగా పేరు మురుగదాస్, తమిళనాడు అని మాత్రమే చెప్పడంతో ఆయ న పరిస్థితి గమనించిన ఎస్సై మాతృదేవోభవ ఆశ్రమం నిర్వాహకులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆశ్రమం నిర్వాహకులను అభినందించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

కేశంపేటలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీఐ నరహరి

కేశంపేట, ఫిబ్రవరి 17 : ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలని కేశంపేట సీఐ నరహరి అన్నారు. కేశంపేటలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం అయ్యప్ప సేవా సమితి, ఆమనగల్లు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సీఐ ప్రారంభించి మాట్లాడారు. అనంతరం స్వచ్ఛందంగా రక్తదానం చేసిన 35మంది యువకులను సీఐ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విశ్వనాథం, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ సభ్యులు అంజిరెడ్డి, నాయకులు మఠం చంద్రశేఖర్, నక్క గోపాల్, జహంగీర్, రమణరెడ్డి, పోల రమేశ్, యుగంధర్, నక్క చంద్రశేఖర్, దత్తురెడ్డి, మహేశ్‌రెడ్డి, నక్క మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి కంటి పరీక్షలు నిర్వహించాలి

షాద్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 17: ప్రభుత్వ పాఠశాలలోని ప్రతి విద్యార్థికి కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు అద్దాలను ఇవ్వాలని జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ షబాహయత్ సూచించారు. షాద్‌నగర్ ప్రభుత్వ దవాఖానలో విద్యార్థులకు సోమవారం నిర్వహించిన కంటి పరీక్షల కార్యక్రమాన్ని ఆమె పరిశీలించి మాట్లాడారు. 236మంది విద్యార్థులు కంటి పరీక్షలు నిర్వహించినట్లు ఉపవైద్యాధికారి డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యాక్సిన్ మేనేజర్ అనిల్‌కుమార్, సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్లు పుష్పలత, సౌజన్య, పద్మలత, పీఎంవోవో చంద్రశేఖర్, రమేశ్, నరేందర్‌రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, ఆర్‌బీఎస్‌కే టీం సభ్యులు, వైద్యాధికారులు, ఫార్మాసిస్టులు, ఏఎన్ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాగన్నగూడలో ఉచిత వైద్య శిబిరం

తుర్కయాంజాల్, ఫిబ్రవరి 17 : తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని రాగన్నగూడలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ 320సీ జోన్ చైర్మన్ ఎల్మటి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో కామినేని హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో రాగన్నగూడ మాజీ సర్పంచ్ శంకరయ్య, కామినేని అస్పత్రి వైద్య బృందం తదితరులు పాల్గొన్నారు.

మండల పరిధిలోని కన్హాశాంతి వనంలో హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సస్టెనబిలిటీ ఇన్ క్లాస్‌రూమ్స్ కార్యక్రమంలో కామన్‌వెల్త్ నేషన్స్ సెక్రటరీ జనరల్ ప్యాట్రిసియా స్కాట్లాండ్ పాల్గొన్నారు.

- నందిగామ, ఫిబ్రవరి17

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

యాచారం, ఫిబ్రవరి 17 : మండల పరిధిలోని నల్లవెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2009-10 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మాల్‌లో ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం జరిగింది. 13 ఏండ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకొని గత జ్ఞాపకాలను, చిన్ననాటి స్నేహాన్ని నెమరువేసుకున్నారు. అప్పట్లో పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు. ప్రస్తుత వారి జీవన స్థితిగతులను తోటి స్నేహితులకు వివరించారు. ఒకరికొకరు యోగ క్షేమాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పౌల్ట్రీ రైతులు సరైన జాగ్రత్తలు పాటించాలి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 17 : కోళ్ల ఫారాల రైతులు జీవ భద్రత విధానాన్ని తప్పనిసరిగా పాటించాలని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి విజయ్‌కుమార్‌రెడ్డి కోరారు. మండల పరిధిలోని పోచారంలో సోమవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై ఆవులు, గేదెలు, దూడలకు పలు రకాల వ్యాధి నిరోధక టీకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోడి మాంసం విక్రయదారులు సరైన జాగ్రత్తలు పాటించాలన్నారు. 110 పశువులకు నట్టల నివారణ మందులు, 25 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స, 40 మినరల్ విటమిన్ మందులు అందజేశారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు శ్రవణ్‌కుమార్, ఇబ్రహీంపట్నం మండల పశువైద్యాధికారి ఆనంద్‌రెడ్డి, జూనియర్ వెటర్నరి అధికారి ప్రసూన, గోపాల మిత్రులు మొగిలి జగన్, వెంకట్‌రెడ్డి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా..

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 17 : కార్మికులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భవన నిర్మాణ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా నూతన అధ్యక్షుడు దాసరి ప్రసాద్ అన్నారు. రావినారాయణరెడ్డి ఆడిటోరియంలో జరిగిన బీవోసీ జిల్లా సభలో రెండో సారి ప్రసాద్‌ను జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తన పై నమ్మకంతో రెండోసారి అధ్యక్షుడి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే జిల్లా కోశాధికారిగా కేతరాజు నర్సింహ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు, కార్మికులు తదితరులు ఉన్నారు.

అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు

మంచాల, ఫిబ్రవరి 17 : అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయనున్నట్లు ఎంపీడీవో బాలశంకర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని లింగంపల్లిలో ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, రైతు భరోసా, ఆత్మీయ భరోసాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.